

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవా సమితి ప్రచురణ)

సంపుటి : 20 | మార్చి, ఏప్రిల్ 24 | సంచిక : 10,11

**సంస్థాపకులు :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు**
**సంస్థాపక సంపాదకత్వం :**
**శ్రీ మాతా శుకవాణి**
**ప్రధాన సంపాదకత్వం :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ**
**ప్రత్యేక సహకారం :**
**డా॥ జి.చంద్రారెడ్డి** M.A, M.Ed., Ph.D
**శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)**
**శ్రీమతి పి.వి. ధనలక్ష్మి (డి.టి.పి)**
**ప్రచార సారథ్యం :**
**శ్రీ బి. గోపీకృష్ణ**
**శ్రీమతి బులుసు జయ**

**సాయివాణి చందా వివరాలు**
2 సంవత్సరాలకు చందా.........రూ॥200/-
10 సం.రాలకు చందా........ రూ॥1000/-

**చిరునామా :-**
**సాయివాణి**
**సాయిధామం, బొమ్మల రామవరం మండలం,**
**యాదాద్రి భువనగిరి జిల్లా-508 126.**
**Ph : 9440413455, 9848133565**

**Online Donations :**
**SRI SAI SEVA SAMITHI TRUST**
**A/c No.62002652136**
**SBI Keesara Branch,**
**IFSC Code : SBIN 0020639**

**విషయసూచిక** — **పుట సంఖ్య**


మా వాణి ........................ 2
శ్రీ సాయి నిత్య పారాయణ ........................ 7
శాశ్వత ధర్మగోప్త ........................ 9
సాయిభక్త దాసగణు ........................ 12
జ్ఞానోదయమే జీవనసాఫల్యము 15
మాతృసంస్థ కబుర్లు ........................ 17
స్మార్ట్ ఫోన్ ........................ 23
DECLARATION ........................ 26
సద్గ్రంథ పఠనం ........................ 27
గంగా ప్రవాహము ........................ 29
శ్రీ సాయినాథ క్షేత్ర వార్షికోత్సవం32

ఈ పత్రికలోని రచయితల అభిప్రాయాలు వారి వ్యక్తిగతమైనవి. పత్రిక యాజమాన్యానికి బాధ్యత లేదు.









# మా వాణి

## పూజ ఎందుకు? ఎవరి కోసం?

పరమాత్మ సాకారుడూ, నిరాకారుడూ కూడా. సృష్టి యావత్తూ పరమాత్మ చేత పర్యాప్తమై ఉన్నది గనుక ప్రతి ఆకృతీ ఆయనదే అయి సాకారుడైనాడు. "యద్దృశ్యం తన్నశ్యమ్" - కంటికి అగుపించే ప్రతిదీ నశించిపోయేదే. భగవంతుడు అవినాశుడు-శాశ్వతుడు. అందుచేత ఆయన నిరాకారుడు. వాక్కులకు అందనివాడు, నిరాకారుడిని ధ్యానించటం సామాన్యునికి కష్టసాధ్యం గదా! ఏ ఆలంబనా (ఆధారం) లేకుండా ధ్యానించటానికి ప్రయత్నిస్తే మనసు రకరకాల రూపాలను సృష్టించుకొని గిరికీలు కొడుతూంటుంది. వివేకానందుల వారు అన్నట్లుగా ఏదో ఒక అనుభూతి కలిగేంతవరకు జీవి తన జన్మకు అనుగుణంగానే భగవంతుడిని ఊహించుకొంటుంది. చీమ ధ్యానిస్తే ఒక మహాచీమను, కుక్క ధ్యానిస్తే ఒక మహాకుక్కను ధ్యానిస్తాయి. మనం మనుష్యులం గనుక ఓ పే.....ద్ధ విరాట్ పురుషుడిని ఊహించుకొంటున్నాము. మనకు అలంకారం, అందం, గొప్పదనం యిష్టమైతే మహావిష్ణువు, కృష్ణుడు వంటి రూపాలను ప్రేమిస్తాం. మన మనసు నిరాడంబరతను, వైరాగ్యాన్ని కోరుకొన్నట్లైతే శివుడి వంటి మూర్తిని ఇష్టపడతాము. వాటికి అనుగుణమైన పూజను చేస్తాం.

పరమాత్ముడు అనేది ఒక మహాశక్తి. ఆయనకు కూడా ఒకటో రెండో పెళ్లిళ్లు చేసి, రెండో, మూడో సంతానాన్ని కనిపించి, మన ఈతి బాధలన్నీ-

పోనీ కొన్నైనా వాళ్ళక్కూడా అంటగడితేగానీ మనకు సంతృప్తి కలగదు. అంతే గాదు-మన బలహీనతలు, పైత్యాలు కూడా దేవతలకు, దేవుఁనికీ అంటించేసి "అంతటి వారికే తప్పలేదు-ఇక మనమనగా ఎంత!" అని సర్ది చెప్పేసుకొని 'అమ్మయ్య' అనుకొంటాం. ఇదీ మానవ ప్రవృత్తి. 'మనం దైవానికి చెందిన వారలం' అనే భావన కాక "దేవుఁడు మనవాడే. మన కష్టాలు తీర్చడం, మనకు లాభాలు చేకూర్చటం, అప్పడప్పడూ మన విరోధులకు మనం కోరిన శాస్తి చేయటం-యివీ దేవుఁని పనులు" అన్న భావనలో పడి కొట్టుకుపోతుంటాం తొంభై తొమ్మిది శాతం మనుష్యులం. పైకి 'అంతా భగవదిచ్ఛ" అంటూనే తమకు కలిగిన ఏ నష్టాన్నీ, కష్టాన్నీ, అవమానాలని తామనుకొంటున్న వాటినీ కూడా దైవేచ్ఛగా భావించి ఆనందించలేని వారెందరో!

భగవద్భక్తులందరికీ శ్రద్ధా కేంద్రాలు దేవాలయాలు, దేవాలయానికి కాంతీ, శాంతీ తేగలవీ, ప్రతిష్ఠితమైన విగ్రహంలోని ప్రాణాన్ని సజీవంగా ఉంచగలవీ అక్కడ నిత్యపూజ చేసే పూజారి భక్తిశ్రద్ధలే. తాము నిత్యపూజ చేసే విగ్రహం కేవలం రాతిబొమ్మో, లోహపుబొమ్మో కాదు. అలా అయ్యేట్లయితే తాను పూజించిన విగ్రహాలు కనుమరుగైతే అన్నమయ్య "ఇందిరా రమణుదెచ్చి యియ్యరో నాకిటువలె వాని పూజింప ప్రొద్దాయె నిపుడూ" అని వాపోవడు. త్యాగరాజస్వామి నిద్రాహారాలు మాని తపించడు. ఆ బొమ్మలకు గుడి కట్టడానికి రామదాసు అన్ని ఇక్కట్లను భవించేందుకు సంసిద్ధుడు కాడు. ఒకసారి పిఠాపురంలోని వేణుగోపాల స్వామి దేవాలయానికి వెళ్లినపుడు అక్కడి పూజారిగారు పాత పూజారి గారిని (తండ్రి గారే) స్వామీజీ దర్శనం చేసుకుంటారని పిలిపించారు. ఆ వచ్చినవారు





శతవృద్ధులు. తడబడే అడుగులతో వచ్చి వేణుగోపాలునికి నమస్కరించారు. "ఎన్నాళ్లకయ్యా! మళ్లీ ఎన్నాళ్లకు చూడగలిగానయ్యా నిన్ను!" అంటూ చెక్కిళ్లపై దొర్లుతున్న కన్నీటి దొంతరలతో విగ్రహాన్ని చుట్టేసి కరిగిపోయారు. అటుపైన స్వామీజీని చూచి నమస్కరించి, పాదాలంటి, చేతులు పట్టుకొని "ఇంకెప్పడయ్యా, నీలో కలుపుకొనేది నన్ను! ఎన్నాళ్లు ఎదురుచూడమంటావింకా!" అని మళ్లీ కన్నీళ్లు పెట్టుకొన్నారు. అలా తాము ఆరాధించే విగ్రహంలో పరమాత్మను దర్శించగలిగేవారే సత్పురుషులలోనూ దైవాన్ని దర్శించగలరు. క్రమక్రమంగా సృష్టిలోని ప్రతి జీవిలోనూ దర్శించగలరు.

అలనాటి పూజారులలో చాలామందికి స్వామి తమ జీవితాలలో ఆలోచనలలో ముఖ్యాతిముఖ్యమైన భాగం. పేదరికం వేటాడుతున్నాయి. పూజలో లోపం రానిచ్చేవారు కారు. తాము కటిక పస్తులున్నా స్వామికి నిత్యభోగం జరపాలని తపించిన వారెందరో! అప్పడు పూజ చేయటం అన్నది ఒక భాగ్యం, పరంపరాగతమైన కులగౌరవంతోపాటు నిలుపుకోవలసిన ఒకానొక మహత్సంపద. కాలక్రమంలో ఆ భావన కొట్టుకుపోయింది. పూజారిత్వం అన్నది కేవలం ఒక వృత్తిగా మారిపోయింది. మిగిలిన వృత్తుల వారి ఆదాయంతో పోల్చుకొని తమ పని పట్ల అగౌరవాన్ని, నిరాదరణను పెంచుకొంటున్నారు నేటి పూజారులలో తొంభై శాతం మంది. వచ్చిపోయే భక్తుల దగ్గర తమ జీతాల అల్పత్వం గురించీ, తమ శ్రమ గురించీ గోడు వెళ్లబోసుకోవడం, వారి మనసులలో సానుభూతి జన్మింపజేసి, అటుపైన ఏవో ముడుపులు, దక్షిణలు స్వీకరించటం-యిది అత్యంత సహజంగా మారిపోయింది.

ఇక మరొక తెగవారున్నారు. వచ్చిన భక్తుడు హారతి పళ్లెంలో వేసే

దక్షిణను బట్టి శఠగోపం తల మీద మృదువుగా పెట్టాలా, ఠంగున కొట్టాలా అని నిర్ణయించుకుంటారు వారు. స్వామి వారి నిర్మాల్యాన్ని చేతిలో వెయ్యటంలో కూడా అంతరాలు చూపగలరు వీరు. భక్తులు గుడి లోపలికి వస్తుండగానే ఎదురువెళ్లి మరీ ఆహ్వానించి తెస్తారు కొందరిని. మరి కొందరిని అరకంట చూచి తలతిప్పకుంటారు. ఈ అంతరం దేనికి? ఆ వచ్చే వారి వలన గుడికో, తమకో ఎంత ప్రయోజనం దొరుకుతుందో వీరు అంచనా కట్టుకుంటారన్నమాట! గురు సన్నిధానంలోనూ, దైవ సన్నిధానంలోనూ అంతరాలెంచటానికి పూజారులెవ్వరు? స్వయంగా బాబావారే సోదాహరణంగా చెప్పారు - "ఎవరి భక్తి ఎట్టిదో భగవంతునికే ఎఱుక" అని. ఒకసారి శివాజీ ప్రభువు సమర్థ రామదాసస్వామి దర్శనానికి వచ్చారు. చాలా కార్యవ్యగ్రతలో ఉండి, మళ్లీ త్వరగా వెళ్లిపోవాలన్న హడావుడిలో ఉన్నారాయన. తీరా ఆయన వచ్చేసరికి ఎవరో ఒక అనామక భక్తుడు స్వామి ఎదుట నిలబడి ఉన్నాడు. ధ్యానమగ్నుడైన ఆ భక్తుడు ఎంతకీ కదలటం లేదు. తొందరలో ఉన్న శివాజీ అతన్ని ఓ ప్రక్కకు లాగివేసి తాను వెళ్లి గురువుకు నమస్కరించబోయాడు. వెంటనే సమర్థుల వారు లేచి నిలబడి "రండి మహారాజా! దయచేయండి" అన్నారు. తెల్లబోయిన శివాజీ "గురుదేవా, నా వలన ఏమి అపరాధం జరిగింది? నన్నిలా అవమానిస్తున్నారెందుకని?" అని కన్నీటి పర్యంతమయ్యాడు. "తమరు మహా ప్రభువులు! తమరు రాగానే ఎవరైనా లేవవలసిందే గదా!" అన్నారు సమర్థులు. తన తప్పు గ్రహించిన శివాజీ వెంటనే ఆ అనామక భక్తుని చెంతకు వెళ్లి క్షమార్పణ అడిగాడు. ఆ తరువాతనే శివాజీకి గురువు అనుగ్రహం దొరికింది. ఈ విషయం ప్రతి పూజారే కాదు-ఆలయ నిర్వా





హకులందరూ కూడా తెలుసుకోవటం మంచిది. విగ్రహం మాట్లాడదు, కోప్పడదు, బోధించదు-అనుకోవటం మూర్ఖత్వం. అది సర్వసాక్షి, ప్రాణ ప్రతిష్ఠ చేశాం మరీ!

భగవంతునికి అష్టోత్తరమో, సహస్ర నామార్చనో, అభిషేకమో జరుగుతున్నపుడు పూజారి దృష్టి పూజ మీద ఏకాగ్రచిత్తతతో ఉంటేనే అది పూజ అవుతుంది. ఎవరు వస్తున్నారా అని గమనిస్తూ, పెదవులు మంత్రం ఉచ్ఛరిస్తుండగా మానసికంగా ఎటో విహరిస్తుంటే అది పూజ ఎంతమాత్రమూ కాదు-కేవలం తంతు మాత్రమే అవుతుంది. అది భక్తులనూ, దైవాన్నీ కూడా వంచింపబూనుకోవటమే. ఈ విషయం పూజ చేసే వారు గ్రహించాలి. అలాగే నిర్వాహకులు, అక్కడ పనిచేసే సేవకులు కూడా ప్రశాంత, ప్రసన్న చిత్తాలతో ఉండటం, భక్తులందరినీ తరతమ భేదాలు లేకుండా ఆదరించటం అవసరం. అంతేకాక మిత్రులో, దగ్గర పరిచితులో వచ్చినపుడు అనవసరమైన ముచ్చట్లలో పడిపోకుండా ఉండటం కూడా అవసరమే. ముఖ్యంగా సాయి దేవాలయాలలో నిశ్శబ్దం ఎంత ఉంటే అంత మంచిది. అక్కడ ఉండేది కేవలం బొమ్మ కాదు. తనకూ తన విగ్రహానికీ భేదం లేదని సాయి చెప్పారు గదా! ఆ మహాశక్తి అక్కడ ఉన్నదన్న నిత్య స్పృహ ఆలయంలో ఉండే వారికి అవసరం.

ఇవ్వేళ ఎవరైనా చాలామంది వస్తారు - అంటే పూజాదికాలు, అలంకరణలు శ్రద్ధగా చేయటం, అలాకానివాడు ఏదో తూతూ మంత్రంగా ముగించటం వంటివి జరక్కుండా జాగ్రత్త పడాలి. పూజ, అలంకరణ స్వామి కోసం చెయ్యాలి తప్ప వచ్చిపోయే వారి కోసమా! పర్వదినాలలో విశేష సేవలు చేయవచ్చు. కానీ సామాన్య దినాలలోని పూజాదికాలలో కూడా ఎట్టి అలక్ష్యం పనికిరాదు. సాయి అక్కడ సర్వసాక్షిగా ఉన్నారు. అది అంతే!

# శ్రీ సాయి నిత్య పారాయణ గ్రంథము

## భక్తి పద్య కావ్యము



రచన : "రంగరాయ" బిరుదాంకిత **శ్రీ మండువ రంగారావు**

**(గత సంచిక తరువాయి)**

ఆ.వె. అతి నిగూఢమైన నాత్మ జ్ఞాన మెఱుఁగ
గురుడు లేక దాని గుట్టు దెలియ
వలను గాదు నీకు కలగానె మిగులును
గురుని వెదకి కొనుము గూడు జేర 23

ఆ.వె. గురువు లేని వాడు గుడ్డివానికివోలె
దారి తెన్ను లేక ధరణి బొరలు
గురువు గలిగెనేని గురుతించ గలుగును
కష్టమేమి లేని కాంతి బాట 24

ఆ.వె. ఎంత కష్టతరమొ! యెవ్వరివ్వగలేని
చక్కని యనుభూతి జిక్క దెపుడు
అనుభవంబు గలుగు నాత్మజ్ఞ గురుడేను
కలుగజేయ గలుగు కనగ నాత్మ 25

ఆ.వె. పాద యుగము భక్తి ప్రణతి జేసి; గురుని
సేవ లందు, నతని సేద దీర్చ
బోధ జేయు నీకు పొందగా జ్ఞానంబు
దాని వలనె నాత్మ దర్శనంబు 26

ఆ.వె. గురుని కృపను బొంద - గురుసేవ కతమున
అతడు నడచి నట్టి - నాత్మ బాట
సహజ రీతి నీకు - సాధ్యపడు నటుల
యున్నతి గలిగించు-యోర్మితోడ 27





ఆ.వె. ఈశుని కృప గలుగ-యిసుమంత కష్టంబు
కలుగ నీక నిన్ను-కడకు జేర్చ
గురుని దొరక జేయు-గుణవంతు నినుజేసి
భవము దాట నీకు - బాట జూప 28

ఆ.వె. ఎంత చదువు జదివి-యెన్ని విన్నను గాని
పొందలేవు నీవు - నాత్మ కాంతి
తెలివితేట లేవి - తెలియ జెప్పగ లేవు
నాత్మ రూపు రేఖ - లందు చోటు 29

ఆ.వె. గురుడు నడచినట్టి - గూఢంపు బాటకు
గురుతు జెప్ప నీకు - గురిగ జేర
వెంట నుండి నిన్ను - విడువక జేర్చును
కాంతి బాట వెంట - కనగ నాత్మ 30

సీ. కాంతలున్ బుత్రులు-కనకంబు లనుచును
యీప్సితముల మున్గి-యీశు మఱచి
లోభ మోహము లందు - లోతుగా చిక్కడి
మమకార బంధాలు - మరువలేక
పరులకు మేల్జేసి - ఫలితంబు నాశించు
దాన ధర్మము లేక - తలరు వాన్కి
యుపదేశ గురుబోధ-ఊసెట్లు గలుగును
ఆత్మ బోధ లెటుల-అంటు నతని

ఆ.వె. యనుచు సాయి బలికె-నందరు వినుచుండ
భోజనంపు విందు - బోధ గలిగె
సాయి నాధు మాట - సత్కీర్తి బడయంగ
మ్రొక్కె సాయి కతడు - మోకరిల్లి 31

**(సశేషం)**

శ్రీ కృష్ణావతారం

# శాశ్వత ధర్మగోప్త



- రచన : భండారు సదాశివరావుగారు

**(గత సంచిక తరువాయి)**

"ఏమి చెప్పమంటారు మహారాజా!"

"పాండవులు వెళ్తూ, వెళ్తూ ఏమన్నారు? వారి ఊహలు ఎలా ఉన్నాయి? వారి వల్ల, వారిననుసరించి నడిచే జనం వల్ల నా సంతానానికి హాని జరుగదు కదా!"

"మీకు పాండవులు సాధు గుణం, సజ్జనత్వం తెలియదా మహారాజా! వారికి దేవతల అనుగ్రహం ఉన్నది. తాపసుల దీవెనలున్నాయి. ఆ అయిదు గురూ సంకల్పసిద్ధులు, దృఢచిత్తులు. ఇహ భీమార్జునుల ప్రతాపం మీకు తెలియంది కాదు కదా! వారు శత్రువులను బ్రతుకనివ్వరు".

"అంటే వాళ్లు వెంటనే యుద్ధానికి వస్తారంటారా?"

"వారు అధర్మానికి ఎప్పుడూ ఒడిగట్టరు. మాట తప్పరు. నేను ముందే క్రీడను ఆపమని మీకు మనవి చేసాను. మహారాణిగారు, పూజనీయు రాలు, మీ పట్టమహిషి, గాంధారీదేవి కూడా మీకు చెప్పింది. సభలో ద్యూతం పేరిట జరిగిన భీభత్సం, పాపవర్తనం కురు వంశానికి శాశ్వత కళంకాన్ని తెచ్చిపెట్టింది. అంతకుమించిన అధర్మం అంటూ మరొకటి ఉండదని, మీకు తెలియదా మహారాజా".

"నేను నిస్సహాయుణ్ణి కదా!"

"మీ పుత్రప్రేమ వల్లనే యజ్ఞాగ్ని సంభూత, అయోనిజ, ఈ ఇంటి కోడలు, పాండవుల ధర్మపత్ని, సాధ్వి పాంచాలికి నిండు సభలో అంతటి పరాభవం, అంతటి అవమానం జరిగింది కదా! అదెంత ఘోరకలో మీకు తెలియదా!





ఋషులు, మునులు, తాపసులు, ప్రజలు ఆ దుష్కృత్యాన్ని ఎంతగా నిరసిస్తున్నారో మీకు గ్రహించగలరు కదా! లోకమంతా మీకు వ్యతిరేకమైంది".

"నేను దుర్యోధనుని మాటను కాదనలేనయ్యా. అయినా ఇంతకూ ఇప్పుడు నన్నేమి చేయమంటావు?"

"పాండవులను తిరిగి హస్తినకు రప్పించండి"

"రప్పించి ....?"

"రప్పించి ధర్మరాజును తిరిగి రాజ్యము నేలమనండి. వారికి పంచి ఇచ్చిన రాజ్యాన్ని, సంపదని, వారు తమ బాహుశక్తితో గెలిచిన భూభాగాలను తిరిగి వారివి వారికిచ్చి సుఖంగా అనుభవించండని చెప్పండి. కురువంశపు పరువు మర్యాదలను నిలిపే బాధ్యత మీ మీద ఉన్నది. మహారాజా! అర్థకామాలైనా, రాజ్యమైనా సుఖాన్ని ఇవ్వాలంటే ధర్మాన్ని ఆశ్రయించాలి. లేని తీరుకు అవే సర్వనాశకాలవుతాయి".

"కాని .... నా మాటలు వినేవారెవరయ్యా?"

"దుర్యోధనుణ్ణి పిలిపించండి. దుశ్శాసన, శకుని, కర్ణుని దుష్ట సలహాలను వినవద్దని గట్టిగా మందలించండి. మహారాజా! దుర్యోధనుడు పుట్టినప్పడే ఎన్ని దుర్నిమిత్తాలు, అపశకునాలు పుట్టినవో మీరు మరచారా! అప్పడే అతణ్ణి వదలుకొమ్మని చెప్పాను. అతని వల్ల కురుకుటుంబానికి, లోకానికి సర్వసంహారకమైన హాని జరుగుతుందని ప్రాజ్ఞులు స్పష్టంగా చెప్పారు కదా మహారాజా! అది గుర్తున్నదా? అతని వల్ల కులక్షయం, జన క్షయం, ధర్మ క్షయం కూడా జరుగుతుందని చెప్పారు కదా! ఇది కేవలం కౌరవ, పాండవుల సమస్యే కాదు కురువంశం నిర్వహించవలసిన రాజ ధర్మం ఒకటున్నది".

విదురుని మాటలు ధృతరాష్ట్రుని గుండె మండిపోతున్నది. కోపం అలలు అలలుగా పొంగి, పైకుబుకుతున్నది.

"మహారాజా కులదూషకుడు, ధర్మద్వేషి, ఆకతాయి పుత్రుడే కావచ్చు. అలాంటి వాని మాటలు వినడం అరిష్టాన్ని కలుగజేస్తుంది. అది కుటుంబపు పెద్దలు చేయవలసింది కాదు. ధర్మరాజుని పిలిపించండి. దుశ్శాసనుణ్ణి వెళ్లి భీమునికి క్షమాపణ చెప్పకోమని శాసించండి. వారు దుశ్శాసనుణ్ణి క్షమిస్తారు. క్షమ క్షాత్రలక్షణం మహారాజా! పాండవులు ఐదుగురూ, వారి పట్టమహిషి ద్రౌపది ఉత్తమ క్షమామూర్తులు. దుశ్శాసనుడు వేడితే, ఇంత కాలంగా నీ కుమారులు చేస్తూ వచ్చిన ఆగడాలను, దుర్మార్గాలను వారందరూ క్షమించి వదిలిపెడతారు. యుధిష్ఠిరుడు సాక్షాత్తు ధర్మ దేవత. ఉచితానుచితాలెరిగిన మహోన్నతుడు. ఎంతటి దుర్మార్గుణ్ణైనా గుండెకు చేర్చుకోగలంత నిండుతనం ఉన్న మహాత్ముడు" అన్నాడు విదురుడు.

ధృతరాష్ట్రునికి ఇహ ఎక్కువ వినే ఓపిక లేకపోయింది.

"అంటే నా తొలి సంతానాన్ని చంపుకోమంటావు. అంతేనా? అదే గదా నీవంటున్నది! ఎంత దయలేని క్రూరకర్ములైనా, కన్న సంతానాన్ని దూరం చేసుకోలేరు కదా! విదురా! నీకు మొదటి నుండి నా కుమారులంటే పడదు. ఎప్పడూ ఆ పాండుపుత్రులనే సమర్థిస్తుంటావు".

"మహారాజా! సత్యం ఎప్పడూ కటువుగానే ఉంటుంది. అది ఇచ్చేవారు కూడా అంత తేలికగా దొరకరు. నా సలహా నచ్చకపోతే సర్వనాశనాన్ని చూచే ఆ దుర్ముహూర్తం కొరకు ఎదురుచూడండి".


ధృతరాష్ట్రునికి నిగ్రహం చెడింది. "విదురా! ఇహ అధిక ప్రసంగం చేయకు. నీవు మొదటినుండి కౌరవవిరోధివే. నీ సలహా, సంప్రదింపులు ఇహ చాలు. నీ సహచర్యం నాకక్కరలేదు. తక్షణమే నీవిక్కడి నుంచి వెళ్లిపో. పో-ఆ పాండవుల దగ్గరికే" అని మాటల నురుగులు క్రక్కాడు.

విదురుడు సాధుమూర్తి. అతడి మనస్సు శతధా వికలమైంది. తల దించుకొని గుండె బరువుతో బైటికి నడిచాడు.

❖ ❖ ❖ **(సశేషం)**







# సాయి భక్త దాసగణు

**రచన : విజయ కిశోర్**

**(గత సంచిక తరువాయి)**

తీరని దాహంతో అశాశ్వతమైన సంపద కోసం జీవితాన్ని వృథా చేసుకునే ధనవంతుల కంటే, మానవ జీవిత పరమార్థాన్ని ఎరిగి, భగవదనుగ్రహ సముపార్జనతో జీవితాన్ని సద్వినియోగం చేసుకునే ప్రయత్నంలో, పేదరికం అనుభవించవలసి వచ్చినా, అందులో ఎంతో పారమార్థిక ప్రయోజనం ఉంటుందని మనకు అవగతమవుతుంది.

బాబా ఈ సత్యాన్నే తమదైన శైలిలో "బంగళావాని కంటే చిరుగు దుస్తుల వాడు మేలు" అని వ్యాఖ్యానిస్తే, "సూది మొనలో నుండి ఒంటె దూరగలదు కానీ, స్వర్గంలోకి (భగవంతుని సన్నిధి లోనికి) ధనవంతుడు వెళ్లలేడు" అని జీసస్ క్రీస్తు వ్యాఖ్యానించారు. (మహాత్ముల పరిభాషలో "పేదవాడు (చిరుగు దుస్తులవాడు)" అంటే కటిక దారిద్ర్యం అనుభవించే వాడని కాకుండా, ఐహిక కోర్కెలు లేకుండా భగవంతుడు ప్రసాదించిన స్థితితో సంతృప్తి చెందేవాడని భావం)

"ఝుసియా" అనే యూదూ మహాత్మునికి సంబంధించిన ఒక అద్భుతమైన కథ ఈ సత్యాన్ని ఇంకా స్పష్టంగా విశదపరుస్తుంది. శ్రీ ఝుసియా తమ జీవితాన్ని కటిక పేదరికంలో గడిపేవారు. ఒక చెట్టు క్రింద ఆయన నివాసం ఉండేది. గడ్డ కట్టించే చలిలో కూడా వణుకుతూ కూర్చొనేవారు. ఒంటి మీద చలికి రక్షణగా ఎటువంటి వస్త్రాలు ఉండేవి కావు. ఎండిపోయిన పుల్లలను సేకరించి చిన్న మంట వేసుకునే వారు. ఎవరయినా భిక్షగా ఇచ్చిన ఆహారంతో ఉదర పోషణ చేసుకునేవారు. ఒకరోజు ఉదయం శ్రీ ఝుసియా "ఓ భగవంతుడా, నా అవసరాలన్నింటినీ తీరుస్తున్నావు. నీవు ఎంతో కరుణామయుడవు" అని భగవంతుని ప్రార్థించ

సాగాడు. అదే సమయంలో ఆ దారి గుండా వెళుతున్న ఆ దేశపు రాజు శ్రీ ఝుసియా యొక్క ప్రార్థనను విని "ఏమయ్యా! ఎందుకు అంత అబద్ధ మాడుతున్నావు. నీకు తినడానికి సరయిన తిండి లేదు. కట్టుకోవడానికి బట్ట లేదు. ఉండటానికి ఇల్లు లేదు. అయినా సరే, ఆ భగవంతునితో "నా అవసరాలన్ని చక్కగా తీరుస్తున్నావు" అని అంటున్నావు అని ప్రశ్నించాడు. అప్పుడు శ్రీ ఝుసియా నవ్వుతూ "ఓ రాజా! నా అవసరం ఆ పేదరికమే!" అని సమాధానమిచ్చారు. అంటే, నా పారమార్థిక ప్రయోజనం కోసమే, నా పట్ల కరుణతో నాకు అవసరమైన స్థితిని ఆ భగవంతుడు ప్రసాదించాడు అని నర్మగర్భంగా చెప్పారు.

అంతెందుకు, రామాయణంలోని మండూకం (కప్ప) కథ ఈ సత్యాన్నే బోధిస్తున్నది. రాముని వింటి వలన గాయపడిన మండూకాన్ని "నీకు గాయం అవుతున్నప్పుడు, రక్షించమని ఎందుకు ఆక్రందన చేయలేదు?" అని అడిగిన రామునితో, "నాకు ఇంకెవరి వలనయినా ప్రమాదం సంభవించితే, "రామా రక్షించు" అని వేడుకునేదాన్ని! కానీ, నా రాముని వలననే నాకు ఆపద వస్తే, బహుశః అది నీ సంకల్పమేననుకున్నాను రామా" అని మండూకం బదులివ్వడం అనే ప్రకరణంలో "భగవంతుని సంకల్పాన్ని సంతోషంగా స్వీకరించాలి" అనే నీతి అంతర్లీనమైయుంది.

మహల్సాపతి, కాకాసాహెబ్ దీక్షిత్ వంటి వివేకవంతుల సచ్చిదానందాన్ని ప్రసాదించే సద్గురు సాన్నిధ్యం ముందు, ప్రాపంచిక ఆనందాలు తుచ్ఛమైనవిగా భావించి, ఆ విధంగా ఆచరించి తమ జీవితాన్ని పునీతం చేసుకున్నారు. దాసగణుపై కూడా బాబా తమ అపార అనుగ్రహాన్ని వర్షింపజేసి, తనచే ప్రాపంచిక జీవితాన్ని త్యజింపజేసి, పారమార్థిక మార్గంలో పురోగమింపజేశారు. ఆ విధంగా తాము సంకల్పించిన, ప్రసాదించిన స్థితిలోనే దాసగణు జీవనయాత్రను కొనసాగించారు. ఆ విధంగా "మాగృధః కస్యస్విద్ధనం" అనే వాక్యం దాసగణు జీవనానికి చక్కగా సమన్వయ





పడుతుంది. ఆ వాక్యాలలోని సారమే బాబా బోధలో ఉట్టి పడుతుంది.

అంతేకాదు, సమర్థ సద్గురు సామ్రాట్టుగా, మహామహితాత్ముడుగా అమేయమైన శ్రీ సాయి సమర్థతకు అద్దం పట్టే ఈ లీలలో అత్యద్భుతమైన అంశం ఒకటి ఇమిడియుంది. ఈ లీలను పఠించగానే అక్షరాలకు అందని అవర్ణనీయమైన, అనునుభవైకవేద్యమైన సద్భక్తి భావాలనే కమలాలు హృదయ కొలనులో వికసించి, సాయి పాదాలంకృత శోభితమవుతాయి.

అత్యంత నిగూఢమైన పారమార్థిక జ్ఞానానికి సంబంధించి దాసగణు తన సందేహాన్ని బాబా వద్ద వెలిబుచ్చితే, "అందులో ఏముందిరా గణూ, కాకా వాళ్లింట్లో పనిపిల్ల చెపుతుంది వెళ్ళు" అని చెప్పి, అతి సులభంగా, ఆ పనమ్మాయి ద్వారా దాసగణు యొక్క సందేహాన్ని నివృతి చేసిన తీరును ఏ పదాల పొందికతో వర్ణించడం సాధ్యమవుతుంది? ఒకవేళ ప్రయత్నం చేసి, పదాలను అతి కష్టం మీద కూర్చి, కాగితంపై పేర్చినా, కనుల నుండి ధారగా కారుతున్న భక్తి ప్రేమాశ్రువులు ఆ పదాలపై పడి చెరిపేస్తున్నాయి. పిచ్చిదానా అదెలా సాధ్యం? అని కలం పరిధిపై జాలి కురిపిస్తున్నాయి.

తన సందేహ నివృత్తి కోసమై పరితపిస్తూ, పూజలో ధ్యానస్తుడైన దాసగణు చెవులలో ఆ పనిపిల్ల పాట వినిపించడం, ఆ పాటలోని చీర వర్ణన, ఆ పాట పాడేటప్పుడు ఆ అమ్మాయి ఒంటి మీదున్న చిరుగు దుస్తులు, ముఖంలోని దైన్యత, మనసులోని న్యూనత, దాసగణు మనసులో ఆ అమ్మాయి పట్ల ఏర్పడిన జాలి, ఆ అమ్మాయికి చీర కానుకగా ఇవ్వాలనే భావన, అంతలోకి శ్రీ ప్రధాన్ ఆగమనం, తన ద్వారా ఆ అమ్మాయికి చీర ప్రదానం, ఆ అమ్మాయి మనసులో సంతోషం, మరుసటి రోజు మరలా చిరుగు దుస్తులలో కనిపించడం, కానీ, ముఖంలో ప్రసన్నత, తద్వారా దాసగణుకు భావ సాక్షాత్కారం ... ఆహా ఎంతటి వైచిత్రి! ఆద్యంతం ఈ ప్రకరణంలో ప్రతి సంఘటన, ఒక వరస క్రమంలో సాయి సంకల్పాను సారమే చోటు చేసుకుందని తేటతెల్లంగా తెలిసిపోతుంది.

**(సశేషం)**

# జ్ఞానోదయమే జీవన సాఫల్యము

- వల్లభనేని కుటుంబరావు

**(గత సంచిక తరువాయి)**

నీ మనస్సు దేనిని స్వీకరిస్తుందో అదే నీ జీవితాన్ని నియంత్రిస్తుంది. ఇతరుల ప్రవర్తన మన లోపల ప్రశాంతతను పాడుచేయకూడదు. మనుషుల ద్వేషాన్ని ప్రేమతో జయించాలి. మూసివేసిన మనస్సు కన్నా భయంకరమైనది మరేది లేదు.

వేగంగా ఉండే మనస్సు రోగిలాంటిది.

నిదానంగా ఉండే మనస్సు పవిత్రమైనది.

మనస్సు నమ్మినదే శరీరం చేస్తుంది.

కర్మ అనేది మనస్సు, మాట, శరీరం ద్వారా వస్తుంది. మనసులో ఏది ఒద్దు అనుకుంటావో, మనస్సు దాన్నే గట్టిగా పట్టుకొంటుంది.

నీ ఆలోచనలు మారితే, నీ జీవితం మారుతుంది. మనస్సు నియం త్రిస్తే మాట, శరీరం నియంత్రణలో ఉంటాయి. నిష్కామకర్మ వల్ల పూర్వ జన్మ కర్మఫలాలు నశిస్తాయి. ఇంద్రియ నిగ్రహం, వైరాగ్యం వలన కోరికలు నశిస్తాయి.

అరిషడ్వర్గాలను నశింపజేయాలంటే ఓర్పు, శ్రద్ధ, కరుణ, ప్రేమ, నిస్వార్థ సేవ నిరంతరం ఆచరించాలి.

వైరాగ్యం మనలని జ్ఞానానికి అర్హులుగా చేస్తుంది. జ్ఞానమంటే విషయ పరిజ్ఞానము కాదు. జ్ఞానం అంటే ఆత్మదర్శనం సత్య దర్శనం, నేనెవరో తెలిపే జ్ఞానం. మనసుకు సత్యం అర్థం కావడం జ్ఞానం. సత్యమే ఆత్మ.

దయ, క్షమ అనేవి మనస్సుకు గొప్ప గుణాలు. దయ అంటే ఎదుటి వారి అవసరం తీర్చడం, క్షమ అంటే వారి తప్పలను సహించి క్షమించడం.





వాస్తవాలను గ్రహిస్తూ, సత్యాన్ని విశ్వసిస్తే శాంతి వస్తుంది. ఎవరు శాంతిగా ఉంటారో వారు ధ్యానంలో ఉన్నట్లే. శాంతగా లేనివారు ధ్యానం చేయనట్లే.

సుఖంతోపాటే దుఃఖం కలిసి ఉంటుంది. శాంతికి మార్గం సత్యదృష్టే. మనస్సు ప్రశాంతతే ఆధ్యాత్మిక మార్గానికి మొదటి మెట్టు. పరమశాంతే చివరి మెట్టు.

జ్ఞానం కన్నా ముందు జీవన సంస్కారం చాలా ముఖ్యం. నిత్య జీవితంలో కోపం రావడం తప్ప కాదు. కాని అది ప్రతీకార చర్యగా, క్రోధంగా మారడం తప్ప.

ముక్తి అనేది మనసు సహజస్థితి. సేవ అంటే బాహ్య ప్రయోజనం కాదు. అంతఃప్రయోజనాన్ని కల్గించే బాహ్య క్రియజీవుల ఉన్నతికి పోషణ, రక్షణకు మన సహకారం అందించటమే సేవ. అదే మాధవసేవ.

ఆలోచన అంటే నేను అనే భావన. నేను అనే భావన తగ్గినకొద్దీ ఆలోచనలు తగ్గుతాయి.

మనోమూలం అర్థం అయితే మనం దేనికీ, కర్తలం, భోక్తలం కాదని తెలుస్తుంది. మనస్సు విషయాల మీద ఆసక్తి చూపడమే బంధమగు చున్నది.

ప్రేమ పరిపూర్ణమైతే "నేను" పోతుంది. మంత్రమైనా, జపమైనా, యోగ మైనా, ధ్యానమైనా "నేను" పోగొట్టుకోవడానికే!

"నేను" (అహం) వ్యక్తమైన చోట పరమాత్మ వ్యక్తం కాదు. అందుకే మనలోనే ఉన్న దైవాన్ని "నేను" అడ్డు వచ్చి తెలుసుకోనివ్వదు.

మనస్సును నడిపే మూలశక్తి ఉంది. అదే అసలైన ఆత్మ.

పవిత్రత అంటే కోరికలు లేని, ఎవరికీ హాని కల్గించని జీవనం సాగించడం. బంధం అంటే మనకిష్టమైన విషయాలలో ఇరుక్కుపోవడం. మోక్షం అంటే మనస్సు ఆవరించిన బంధాల నుండి విడివడటం. అరిషట్ వర్గాలకు దూరంగా ఉండటమే వైరాగ్యం.

**(సశేషం)**

# మాతృసంస్థ కబుర్లు

మార్చి 23వ తేదీన రోటరీ క్లబ్ ఆఫ్ యాదగిరిగుట్ట వారి ఆధ్వర్యంలో సాయిధామంలో ఉన్న పేద వ్యక్తులకు డా॥ ఎంపల్లి బుచ్చిరెడ్డిగారు ఛైర్మన్, న్యూ క్లబ్స్ ఎక్స్‌టెన్షన్ జోన్-2 గారి సహకారంతో ఆశ్రమ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీగారి కరకమలముల మీదుగా ఉచితంగా రూ.16000/- విలువ గల రెండు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీ రామానంద ప్రభుజీ వారు మాట్లాడుతూ రోటరీ క్లబ్ సేవలు ప్రశంసనీయమైనవనీ, రోటరీ చేస్తున్న సేవలను ప్రశంసించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో శ్రీ డీకొండ వెంకటేష్ అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు శ్రీ గడ్డం జ్ఞానప్రకాష్‌రెడ్డిగారు, కార్యదర్శి శ్రీ కైరంకొండ సుధీర్, శ్రీ చెలదె అశోక్‌గారు, కోశాధికారి, ఆశ్రమ నిర్వాహకులు చంద్రారెడ్డిగారు, ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మార్చి 26వ తేదీ శ్రీ వ్యాసాశ్రమ గురుపరంపర పూజ్య శ్రీశ్రీశ్రీ పరిపూర్ణానందగిరి స్వాముల వారు నిర్వహించిన 98వ శ్రీ సనాతన వేదాంత జ్ఞానసభల్లో ఆశ్రమ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారు పాల్గొన్నారు.

మార్చి 28వ తేదీ ఫాల్గుణ బహుళ విదియ (తిథుల ప్రకారం) పూజ్య గురుదేవులు శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారి 85వ జన్మదినం. ఆశ్రమవాసులకు, భక్తులకు పవిత్రదినం.

మహనీయుల జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రతిఒక్కరూ వారి ఆశయ సాధనలో నడుస్తూ మరికొంత మంది జీవితాలలో జ్ఞానజ్యోతులను ప్రకాశింపజేయడమే మనం వారికిచ్చే నివాళి.

జ్ఞానధామాన్ని పుష్పాలంకరణతో సుందరంగా అలంకరించడమైనది.





85 వసంతాలు నిండిన సందర్భంగా 85 ఆకృతిలో దీపాలంకరణ కన్నుల పండుగగా జరిగింది. భక్తులంతా దీపాలు వెలిగిస్తూ 'స్వామీ మాలో ఉన్న అజ్ఞానమనే చీకటిని తొలగించి, సన్మార్గంలో పయనించే మార్గాన్ని చూపండి గురుదేవా' ని ప్రార్థించారు. తదనంతరం ఆనవాయితీగా వస్తున్న కుష్ఠురోగులకు ఇచ్చే వస్త్ర, వస్తు, దానాలు ట్రస్టు సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, కార్యక్రమానికి విచ్చేసిన భక్తుల చేతుల మీదుగా అందించడం జరిగింది. అనంతరం 85వ జన్మదినాన్ని పురస్కరించుకొని స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారు సత్యపదానంద ప్రభుజీ వారి శక్తినీ, ఆధ్యాత్మికతను, వారి ఆశయాన్ని భక్తులకు వివరించారు. సత్పురుషులు నడయాడిన మార్గంలో మనం నడుస్తూ మానవ జీవితం సార్థకతను పొందాలి. చెడు మార్గంలో నడుస్తూ, భూమికి భారంగా ఉంటూ ఉంటే మానవజన్మను పొందిన ప్రయోజనం ఉండదు. ఆత్మనిగ్రహం ప్రతి మనిషికి కావలసినది. మనకు ఎంత సంపద ఉన్నా ఎంత బంధుబలగం ఉన్నా వృధానే. ఒక్క గురుకృప మన మీద ఉంటే మనం అన్నీ సాధించినట్టే అని వివరించారు.

అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. సాయి విద్యాధామం పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు పులిహోర, స్వీటు శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారి చేతుల మీదుగా పెట్టడం జరిగింది.

సాయిదత్త పీఠం, సాయిధామం సేవాశ్రమంలో శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారి ఆశీస్సులతో ఏప్రిల్ 12, 13, 14 తేదీన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం నిర్వహించిన ప్రారంభిక్ శిక్షా వర్గ కార్యక్రమంలో సుమారు 50 మంది పైచిలుకు కార్యకర్తలు పాల్గొన్నారు. ఆశ్రమ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీ రామానంద ప్రభుజీవారు ముగింపు సమావేశంలో పాల్గొని విద్యార్థులకు దేశం, ధర్మం, సభ్యత, సంస్కారం, మన కర్తవ్యం మొదలగు విషయాలపై విద్యార్థులకు సవివరంగా వివరించడం జరిగింది. మూడు రోజులపాటు ఆశ్రమం అందించిన

సహకారానికి సంఘ ప్రముఖులు ధన్యవాదాలు తెలిపారు.

ఏలూరు జిల్లాలోని పెదవేగి మండలం మండూరు క్షేత్రంలోని శ్రీ యాజ్ఞవల్క్య రాజాశ్రమ పీఠాధిపతులు శ్రీశ్రీ కృష్ణ చరణానంద భారతి స్వామి వారి ఆహ్వానం మేరకు యాజ్ఞవల్క్య రాజాశ్రమంలో 66వ వార్షికోత్సవ అఖిల భారత మహాసభలు ఏప్రిల్ 14, 15, 16 తేదీలలో సాయిదత్త పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారు పాల్గొన్నారు. ఈ సభల ఉద్దేశం సాధువుల జీవనం, సమాజ కళ్యాణం, గృహస్తులు పాటించవలసిన విధి విధానాలపై ప్రవచనం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో 400 మంది పైచిలుకు సాధు పుంగవులు, భక్తులు పాల్గొన్నారు.

**శ్రీ కోదండ రామసాయి సన్నిధానం ఆశ్రమం,**

**శ్రీ సాయీ సేవా సమితి ట్రస్ట్ అనుబంధ శాఖ, సత్తెనపల్లి**

శ్రీ కోదండ రామ సాయి సన్నిధానం ఆశ్రమంలో కీర్తి ధ్వజస్తంభము, జీవధ్వజస్తంభాల ప్రతిష్ఠాపనా మహోత్సవము మార్చి 14, 15, 16వ తేదీలలో అత్యంత వైభవోపేతంగా జరిగినది.

పరమపూజ్య గురుదేవులు శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ వారు శ్రీ కోదండ రామాలయాన్ని జీర్ణోద్ధరణ దశలో తీసుకుని ఆలయాన్ని నవీకరించి, ప్రక్కన చక్కటి సాయి మందిరాన్ని నిర్మించి, పూజాదిక కార్యక్రమాలు జరుగునట్లు ఏర్పాటు చేసి ఆశ్రమానికి నూతన శోభను చేకూర్చారు. అప్పటి నుండి నిత్య ధూప, దీప, నైవేద్యాలతో స్వామి వార్ల పూజలు, కార్యక్రమాలు వైభవంగా జరుగుతూ వస్తున్నవి.

సాయిదత్త పీఠం ప్రస్తుత పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారి ఆధ్వర్యంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలతో ఆశ్రమం దినదినాభి వృద్ధి చెందుతున్నది. ఆశ్రమంలో ఉన్న పురాతనమైన (దాదాపు 90 సం.లు) కోదండ రామాలయానికి ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేయాలని శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారి సంకల్పం మేరకు శ్రీ సాయీ





సేవా సమితి మేనేజింగ్ ట్రస్టీ డా॥ జి.చంద్రారెడ్డిగారు మిగతా ట్రస్ట్ సభ్యులు సంకల్పించారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠ అంటే ఎంతో వ్యయప్రయాసలతో కూడుకున్నది. అయినప్పటికి స్వామి సంకల్పం వలన 41 అడుగుల రాతిస్తంభం ఇవ్వడానికి శ్రీ శాత్రాసుపల్లి మాణిక్యాలరావుగారు ముందుకు రావడం, 34 అడుగుల జీవస్తంభం ఇవ్వడానికి శ్రీ వరికల్లు కోటేశ్వరరావుగారు ముందుకు రావడం, అలాగే ఆలయ ముఖద్వారం, టేకు తలుపులు ఇవ్వడానికి శ్రీ దరిపల్లి రామకోటయ్యగారు, గర్భాలయానికి టేకు తలుపులు శ్రీ శాత్రాసుపల్లి వీరనారాయణగారు, ముఖద్వారం రెండువైపులా టేకు కిటికీలు ఇవ్వడానికి శ్రీ శాత్రాసుపల్లి ఈశ్వరరావుగారు ముందుకు రావడం, శ్రీ వరికల్లు రామయ్యగారు ఆలయానికి 18 కేజీల కంచు గంటను సమర్పించడంతో కోదండ రాముడు తన ఆలయానికి కావలసిన అన్నీ తన భక్తుల ద్వారా సమకూర్చుకుంటాడని మరొకసారి నిరూపిత మవ్వగా అందరిలో ఉత్సాహం వెల్లివిరిసింది. ఆశ్రమ పరిసరాలలో ఉన్నటువంటి పెద్దలను పిలిపించి, ఈ ధ్వజస్తంభ ప్రతిష్ఠా కార్యక్రమానికి కావలసిన ఆర్థిక పరిపుష్టిని సంపూర్ణం చేయడానికి శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీ రామానంద ప్రభుజీవారు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనా ఉత్సవ సమితిని ఏర్పాటు చేశారు. అందరూ ఉత్సాహంగా తరతమ భేదం లేకుండా ఈ కార్యక్రమంలో పాలుపంచుకుని ద్రవ్య సమీకరణకు పాటుపడ్డారు.

మూడు నెలల కాలం ఇట్టే గడిచిపోయినది. మార్చి 14, 15, 16 తేదీలలో ప్రతిష్ఠా కార్యక్రమం నిర్వహించాలని, 16వ తేదీ ఉదయం 8.55 ని.లకు రోహిణీ నక్షత్రయుక్త మేష లగ్న పుష్కరాంశమునందు ప్రతిష్ఠ జరగాలని సుముహూర్తం నిర్ణయించారు. పాంప్లెట్లు, ఫ్లెక్సీలు తయారు చేయించడం, ఆశ్రమంలో లోతట్టుగా ఉన్న ప్రదేశాన్ని మెరక చేయుటకు మట్టి తోలించడం, ద్వారం పగలగొట్టి కొత్తది పెట్టించడం, గోశాల, ప్రక్కన ఉన్న రెండు గదుల ఆధునీకరణ, యాగశాల నిర్మాణం పనులు అన్నీ

చకచకా జరిగినవి. పరిసరాలలో ఉన్నటువంటి వారందరు తమతమ బంధు మిత్రులను, ఇంటి ఆడపిల్లలను పిలుచుకొని వారందరికీ బట్టలు పెట్టే సంప్రదాయాన్ని ఆచరించడం, అంతా ఒక పండుగ వాతావరణం నెలకొన్నది.

ఎప్పుడెప్పుడా అనుకున్నసమయం రానే వచ్చినది. శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీ రామానంద ప్రభుజీ వారు 15 రోజుల ముందుగా వచ్చి ఏర్పాట్లన్నీ స్వయంగా పర్యవేక్షించారు. ఒకప్రక్క 14వ తేదీ అంకురార్పణకు హోమాది కార్యక్రమాలు చేయుటకు బెల్లంకొండ సిద్ధాంతిగారు శ్రీ బ్రహ్మశ్రీ పులుపుల వేంకట ఫణికుమారశర్మగారి బృందం ఆధ్వర్యంలో యాగశాలలో హోమ గుండాలు, పీఠాల నిర్మాణం పనులు, 14వ తేదీ సాయంత్రం జీవధ్వజ స్తంభ మరియు ఉత్సవమూర్తుల ఊరేగింపు కార్యక్రమానికి ఏర్పాట్లు జరిగినవి. ఆశ్రమమంతా కాషాయధ్వజాలతో, రామాలయం ముందు నూతనంగా ఏర్పాటు చేసిన పందిరితో శోభాయమానంగా తయారైనది.

14వ తేదీ 7.30 ని.ల నుండి తోరణబంధనం, మంగళ వాయిద్యములు, వేదస్వస్తితో ఆలయప్రదక్షిణ, అనంతరం గోపూజ, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశన, రక్షాబంధన, దీక్షా ధారణ, యాగశాల ప్రవేశం జరిగినది. సాయంత్రం 7 గం.ల నుండి జీవ ధ్వజ స్తంభము, ఉత్సవమూర్తుల ఊరేగింపు ఎంతో ఉత్సాహంగా, కోలాట నాట్యాలతో, భక్త జనాలతో కోలాహలంగా ఎంతో వైభవంగా జరిగినది.

మార్చి 15వ తేదీ ఉదయం 5.30 ని.లకు సుప్రభాతం, నిత్యవిధి మంటపార్చనలు, మంటప దేవతా హోమాలు, విశేష స్నపన జలాధివాసాలు, సాయంత్రం 5 గం.ల నుండి యాగశాలలో మూలమంత్ర హవనం, మన్యు సూక్త, సుదర్శన నారసింహ విశేష హవనం, అనంతరం ధాన్యాదివాస, పంచ శయ్యాధి వాసములు, నీరజనాదులు, దర్బార్ సేవ తీర్థగోష్ఠులు మొదలైన కార్యక్రమాలు జరిగినవి.





మార్చి 16వ తేదీ 5.35 ని.లకు సుప్రభాతం, మహా నారాయణ హవనం, గర్తన్యాస బీజరత్న ధాతున్యాసాదులు అనంతరం గం.8.55 ని.లకు సుముహూర్త సమయానికి భక్తులందరూ కోదండ రాముడికి జయజయ ధ్వానములు పలుకుతూ రెప్పవాల్చితే దృశ్యము ఎక్కడ కనుమరుగవుతుందో అని ఊపిరి బిగబట్టి చూస్తున్నవేళ సుముహూర్త సమయానికి రెండు ధ్వజస్తంభాలు ఒకటి తర్వాత ఒకటి పరమహంస పరివ్రాజకాచార్య శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారి కరకమలములచే జీవ ధ్వజ స్తంభము, పరమహంస పరివ్రాజకాచార్య శ్రీశ్రీశ్రీ కమలానంద భారతి, భువనేశ్వరి పీఠం గన్నవరం వారి కరకమలములచే కీర్తి ధ్వజ స్తంభము ప్రతిష్ఠితమైనది. అనంతరం శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీవారి కరకమలములచే రావిచెట్టు క్రింద గోవింద నామాలు, శంఖుచక్రాలు ప్రతిష్ఠింపజేశారు. అనంతరం శ్రీశ్రీశ్రీ కమలానంద భారతిగారి ప్రవచనం, శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారి ప్రసంగం, తదుపరి పూర్ణాహుతి జరిగినది. పూర్ణాహుతి జ్వాలలో ఆంజనేయ స్వామి రూపం దర్శనమవడం విశేషం. అనంతరం వేలాదిగా వచ్చిన భక్తజనులు ధ్వజస్తంభములకు నమస్కరించి, కొబ్బరికాయలు కొట్టి, సీతాలక్ష్మణ హనుమత్సమేత శ్రీ కోదండ రాముల వారిని కనులారా దర్శించి అన్నప్రసాదం స్వీకరించి, సీతారాముల కృపకు పాత్రులయ్యారు. ఆశ్రమం ప్రక్కనే విశాలమైన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్న సంతర్పణకు భక్తులు విశేషంగా తరలి వచ్చారు. దాదాపుగా 10వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించి తరించారు. ఎంతో వైభవోపేతంగా జరిగిన ఈ కార్యక్రమం ఆశ్రమ కార్యక్రమాలన్నిటిలో ఒక కలికితురాయి అని చెప్పకోవడంలో అతిశయోక్తి లేదు.

పరమపూజ్య గురుదేవులు శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ వారి దివ్య సంకల్పం, పూజ్య మాతాజీ గారి ఆకాంక్ష ఈ ఆశ్రమానికి మరిన్ని హంగులు ఏర్పరచి, సత్తెనపల్లిలోనే ఒక దివ్యక్షేత్రంగా విరాజిల్లాలని

అహరహం శ్రమిస్తూ ముందుకు నడిపిస్తున్న శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారి కోరికను శ్రీ కోదండరాముడు నెరవేర్చాలని మేమందరము ఆకాంక్షిస్తున్నాము. ఈ కార్యక్రమం దిగ్విజయంగా జరగడానికి ద్రవ్య సమీకరణలో పాలుపంచుకున్న భక్తులు, కార్యకర్తలకు, ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన అందరికీ పేరుపేరునా శ్రీ కోదండరాముని దివ్య ఆశీస్సులు కలగాలని శ్రీ సాయీ సేవా సమితి ట్రస్ట్ తరపున హృదయ పూర్వకంగా కోరుకుంటున్నాము.

# స్మార్ట్ ఫోన్

**– వాట్సప్ సేకరణ**

ఆమె పిల్లలు పడుకున్నారు!

భర్త కుర్చీలో కూర్చొని తన స్మార్ట్‌ఫోన్లో 'క్యాండీ క్రష్'లో లీనమై యున్నాడు.

చివరి పేపరు దిద్దడానికి తీసి చదివిన ఆ టీచర్ నిశ్శబ్దంగా ఏడుస్తూ ఉంది.

ఆ ఏడుపు వెక్కిళ్ళ శబ్దానికి భర్త తలతిప్పి చూసి ఆశ్చర్యపోయాడు!

"ఏమైంది? ఎందుకు ఏడుస్తున్నావు? ఏం జరిగింది" అడిగాడతను టెన్షన్తో.

నిన్న నా సెకండ్ క్లాస్ విద్యార్థులకు హోంవర్క్ ఇచ్చాను. "మీరు ఏం కావాలనుకుంటున్నారు" అనే అంశంపై ఏదైనా రాసుకుని రమ్మని.

"అయితే....?

"ఇదిగో! ఈ చివరి పేపర్ దిద్దుదామని చదువుతుంటే ఏడుపును ఆపుకోవడం నా తరం కావడం లేదు!!"

భర్త ఆసక్తిగా .... "అంత ఏడిపించే విధంగా ఏం రాశాడు?"





హెడ్డింగ్ ఇలా పెట్టాడు.

**"నేను స్మార్ట్ ఫోన్ అవ్వాలని నా కోరిక"**

అమ్మానాన్నలు స్మార్ట్‌ఫోనును చాలా ప్రేమిస్తారు!

వాళ్ళు స్మార్ట్‌ఫోనును చాలా కేర్‌గా ... శ్రద్ధగా ... ఇష్టంగా చూసుకుంటారు. నాకన్నా ఎక్కువగా....!!

నాన్న ఆఫీసు నుండి అలసటతో వచ్చినప్పుడు, అతనికి స్మార్ట్ ఫోన్ రిలాక్స్‌ను ఇస్తుంది. నాన్నకి స్మార్ట్‌ఫోన్ కోసం సమయముంది. కానీ, నా కోసం లేదు! ఎందుకంటే నాతో ఆడుకోవడం మా నాన్నకు రిలాక్స్‌ను ఇవ్వడం లేదు!

అమ్మానాన్నలు ముఖ్యమైన పనుల్లో ఉన్నప్పుడు కూడా స్మార్ట్‌ఫోన్ రింగౌతుంటే ... ఒకటి రెండు రింగులు వచ్చేలోపే వాళ్ళు ... ఫోన్ చేతిలోకి తీసుకుని జవాబిస్తారు!

కానీ ... నేను ఎన్నిసార్లు పిలిచినా దానికిచ్చే ప్రిఫరెన్స్ నాకివ్వరు.

నేను ఏడుస్తూ వుంటే కూడా వాళ్ళు నాతో కాకుండా స్మార్ట్‌ఫోన్లతో గడుపుతుంటారు!

వాళ్ళు నాతోకన్నా స్మార్ట్‌ఫోన్లతో ఆడుకోవడానికే ఎక్కువ ఇష్టపడతారు!

వాళ్ళు తమ స్మార్ట్‌ఫోన్లో మాట్లాడుతున్నపుడు నేనేం చెప్పినా వినిపించుకోరు!

అది నాకు ముఖ్యమైన విషయమైనా సరే!

అదే ఒకవేళ నాతో మాట్లాడుతున్నప్పుడు రింగ్ వస్తే మాత్రం వెంటనే ఫోన్‌కి జవాబిస్తారు!

అమ్మానాన్నలు

స్మార్ట్‌ఫోన్‌ను కేర్‌గా చూసుకుంటారు!

ఎప్పుడూ తనతోనే ఉంచుకుంటారు!

దానికి చాలా ప్రాధాన్యతనిస్తారు!

దాన్ని చాలా ఇష్టపడతారు!!

దానితో రిలాక్స్ అవుతుంటారు!!

దానికి తమ ఖాళీ సమయాన్ని కేటాయిస్తారు!!

దానిని ఎపుడు పనివాళ్ళకి అప్పగించరు.

నేను ఒకరోజు మాట్లాడకపోయినా బాధపడరు. కానీ స్మార్ట్ ఫోన్ ఒక్క గంట పనిచేయకపోతే చాలా కంగారుపడతారు, హడావిడి చేస్తారు.

రాత్రి పడుకున్నప్పుడు కూడా ప్రక్కనే ఉంచుకుంటారు!!

ఉదయం లేవగానే దాన్నే చేతిలోకి తీసుకుంటారు!!

కాబట్టి! నా కోరిక ఏమిటంటే ... నేను అమ్మానాన్న చేతిలో ఉండే స్మార్ట్‌ఫోన్ కావాలనుకుంటున్నాను!!

భార్య చదువుతుంటే ... విన్న భర్తకు మనసంతా పిండేసినట్లైంది!! అతని కళ్ళలో కూడా కొంచెం తడి వస్తుండగా ....

"ఎవరు రాశారది?" అడిగాడు భార్యని.

"మన కొడుకు" అంది భార్య కన్నీరు కారుతుండగా!

**వస్తువులను ఉపయోగించుకోవాలి!**

**బంధాలను ప్రేమించాలి!!**

అన్ని బంధాల కన్నా ఎక్కువగా వస్తువులపై బంధాన్ని ఏర్పరచుకొని ప్రేమించడం మొదలుపెడుతూ ఉంటే ... క్రమంగా అసలైన బంధాలు వెనక్కి నెట్టివేయబడతాయి! ...

ఇది నిజంగా జరిగిన కథ ....

**కాబట్టి ఇలాంటి కథలో తల్లిదండ్రులు మీరు కాకండి!**

**దయచేసి ప్రతి ఒక్కరూ ఆలోచించండి!!**

**ఒక్కసారి ఆలోచిద్దాం!!!**





# DECLARATION


Statement about ownership and other particulars about **"Sachidananda Sadguru Sai Vani".**


| | | | |
|---|---|---|---|
| 1. | Place of publication | : | Hyderabad |
| 2. | Periodicity of publication | : | Monthly |
| 3. | Printer's Name | : | V.V. Krishna Rao |
| | Nationality | : | Indian |
| | Address | : | Sai Sri Printers, 8-3-945, Shop No. 21, Pancom Business Centre, Ameerpet, Hyderabad - 500 016 (A.P.) |
| 4. | Publisher's Name | : | Sri Ramananda Prabhuji |
| | Nationality | : | Indian |
| | Address | : | Saidhamam, Yadadri Bhuvanagiri Dist, Pin - 508 126 |
| 5. | Editor's Name | : | Sri Ramananda Prabhuji |
| | Nationality | : | Indian |
| | Address | : | Saidhamam, Yadadri Bhuvanagiri Dist, Pin- 508 126 |
| 6. | Owner's Name | : | Sachidananda Sadguru Sai Vani Publications, Saidhamam, Yadadri Bhuvanagiri Dist- 508 126 |

I, Sri Ramananda Prabhuji declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date : 01-03-2024

Sd/-

Sri Ramananda Prabhuji



# సద్గ్రంథ పఠనం

- శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ

మానవజీవి జన్మించినపుడు 'పసివాడు' అంటారు. సుమారు రెండు సంవత్సరాలదాకా ఈ పరిస్థితిలోనే ఉంటాడు ఆ జీవి. పసి అంటే 'పశువు' అనే అర్థం. ఇలా ఎందుకన్నారంటే ఆ కాలఖండంలో ఆ పసివాని ప్రవర్తనకూ, పశువు ప్రవర్తనకూ పెద్ద తేడా కన్పించదు. సిగ్గూ బిడియమూ తెలియకుండా దిగంబరంగా తిరగటం, ఎక్కడ పడితే అక్కడ మలమూత్ర విసర్జన చేయటం. చేతికి దొరికిందాన్నల్లా నోట్లో పెట్టుకోవడం, స్వపర భేదాలు తెలియకపోవటం-ఇవన్నీ కూడా పసివాని లక్షణాలు.

వయస్సు పెరుగుతున్నకొద్దీ ఈ స్థితిని దాటి బాల్యావస్థలోకి ప్రవేశిస్తాడు. ఆ సమయంలో చాలా విషయాలు నేర్చుకుంటాడు. (నేర్పేవాళ్లను బట్టి) ఇతరులను అనుకరిస్తూ ఎదుగుతుంటాడు. ఈ సమయంలో ఏర్పడే సంస్కారాలతోనే తరువాతి జీవితమంతా ప్రభావితమౌతుంది. అతడు క్రమంగా మనిషిగా ఎదుగుతాడు. రాగద్వేషాలను క్రమబద్ధీకరించు కుంటూ సామాజిక మర్యాదలను పాటిస్తూ మానవత్వపు విలువలను పెద్దల ద్వారా, సద్గ్రంథాల ద్వారా తెలుసుకుంటూ, తెలుసుకున్న దానిని శ్రద్ధగా ఆచరిస్తూ మంచిమనిషిగా గుర్తించబడతాడు.

లోకంలో చాలామంది ఇంతటితో సరిపెట్టుకుంటారు. ఇక్కడనే ఆగి పోతారు. కొద్దిమంది మాత్రం జన్మాంతర సంస్కారాల వల్లనో, సత్పురుషుల సహవాసం వల్లనో, సద్గురు బోధల వల్లనో ప్రేమా, త్యాగం వంటి సద్గుణా లను అలవరచుకొని మహనీయులుగా ఎదుగుతారు.

కాని మన ధర్మశాస్త్రాలు, వేద వేదాంతాలు ఆ మనిషి మనీషి స్థాయిలో ఆగరాదనీ, ఎంతో పుణ్యం ధారపోసి సంపాదించిన ఈ మానవజన్మను





మోక్ష సాధనకే వినియోగించుకోవాలనీ- అలాకాక ఈ మానవజన్మను ఇహలోక సుఖాల వరకే పరిమితం చేసుకొని పశుతుల్యులుగా జీవిస్తే ఎన్నిరకాల నీచజన్మలో అనుభవించి అనుభవించి ఎన్ని వేల సంవత్సరాల తర్వాతనో ఎప్పటికో మళ్లీ మోక్షసాధనకు అనుకూలమైన మానవజన్మ పొందవచ్చు. కానీ ఈ లోపల-పునరపిజననం, పునరపి మరణం పునరపి జననీ జఠరే శయనం-తప్పదనీ దీన్ని తప్పించుకోవాలంటే ఇప్పుడు లభించిన ఈ మానవజన్మనే సద్వినియోగం చేసుకోవాలనీ చెవిని ఇల్లు కట్టుకొని బోధిస్తుంటారు పెద్దలు.

ఈ విషయాలను మనస్సుకు హత్తుకునేటట్లుగా బోధించేవి ముఖ్యంగా మూడు గ్రంథాలు-అవి రామాయణ, భారత, భాగవతాలు. వాటిల్లో మన జీవితాలకు సన్నిహితంగా ఉండే కథాకథనం నడుస్తుండ గానే సందర్భోచితంగా మానవుడు దైవత్వాన్ని సాధించటానికి, చివరకు ముక్తుడు కావటానికీ పాటించవలసిన ధర్మాలు కూడా చెప్పబడ్డాయి. ఆ గ్రంథాలు మన ఋషులు మనకు ప్రసాదించటం మన అదృష్టం.

శ్రీ మహాభాగవతం సప్తమ స్కంధములోని ప్రహ్లాద చరిత్రలో హిరణ్య కశ్యప ప్రహ్లాదుల సంభాషణ చూడండి. ఎన్నిబాధలకు గురిచేసినా వెరవక శ్రీ హరికీర్తన మానక తనను ఎదిరించుచున్న కుమారునితో హిరణ్యకశ్యపుడు -

"దిక్పాలకులైన సూర్యుడు, వాయువు, అగ్ని, యముడు, ఇంద్రుడు మొదలైనవారే నా ఆజ్ఞలను అతిక్రమించటానికి భయపడతారు, దేవతలు, కిన్నెరులు, గంధర్వులు, యక్షులు, విహగులు, నాగులు, విద్యాధరులు మొదలైన దేవ యోనులందరో నాకు భయపడతారు. అన్ని దిక్కులను నేనే గెలిచాను. దిక్పాలకులకు వేరే దిక్కులేక నన్నే తమ దిక్కుగా సేవిస్తూ ఉంటారు. మహా బలులను జయించిన బలవంతుడను. ఏ బలమును నమ్ముకొని నన్నెదిరిస్తున్నావు?" అని గర్వంగా ప్రశ్నించాడు. అప్పుడు

ప్రహ్లాదుడు వినయంగా “బలవంతులకూ, బలహీనులకూ చివరకు నీకూ నాకూ బ్రహ్మాదులకు కూడా బలమెవ్వడో అటువంటి ఆ భగవంతుడే నాకున్న బలము. దిక్కులన్నిటికీ దిక్కైనవాడే మనకు దిక్కు. ఆ విష్ణువు నీకు శత్రువు అంటున్నావు కానీ, ప్రతి వానికీ అసలైన శత్రువు చిత్తమే గదా! మదముతో గూడిన రాక్షస భావము మాని అసలైన శత్రువును గుర్తించు లోకాలన్నిటినీ గడియలోపల జయించిన వాడవు కానీ నీ యింద్రియాలనూ చిత్తమునూ గెలవలేకపోతున్నావే! నిన్ను బంధించే భయంకరులైన ఆరుగురు శత్రువులూ. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే వాళ్ళు నీలోనే ఉండి నీకు ఘోరమైన కీడును ఆపాదిస్తున్నారు. నీ ప్రతాపాన్ని వారి మీద చూపించి గెలవగలిగితే ఇక ఈ లోకంలో నీకు శత్రువంటూ ఎవ్వడూ ఉండడు సుమా”. ఈ బోధ ఒక్క హిరణ్యకశ్యపునకే కాదు. మోక్షార్థియైన ప్రతి మానవుడూ ఈ ఆరుగురు శత్రువులనూ గెలిచి తీరాలి.

# గంగా ప్రవాహము

- యిమ్మిడిశెట్టి ప్రభాకరరావు, హైదరాబాదు

దాసగణు మహారాజ్ సాయి భక్తాగ్రగణ్యుడు. దాసగణు ఒకసారి బాబా దగ్గరకు వెళ్లి తనకు ప్రయాగ పుణ్యక్షేత్రంలోని గంగా యమునల సంగమంలో స్నానం చేయాలని కోరిక కలిగిందని అందుకు అనుమతిని ప్రసాదించమని ప్రార్థించాడు. “గణూ అంత దూరం వెళ్ళవలసిన అవసరమే లేదు. మన ప్రయాగ ఇక్కడనే షిరిడీలోనే ఉంది. నా మాటలు విశ్వసించు” అన్నారు బాబా. దాసగణు సాయి పాదాలపై తన శిరస్సు నుంచిన వెంటనే బాబా రెండు పాదాల బొటనవ్రేళ్ళ నుండి గంగా యమునలు కాలవలుగా ప్రవహించాయి అవి తలపై జల్లుకొన్నాడు. భక్త్యావేశంతో అతడి హృద





యంలో ఉప్పెనలా ఉప్పొంగింది. బాబా శక్తిని, అపరిమితమైన ఆయన మహిమను “అగాధ శక్తి అఘటిత లీలా తన సద్గురు సాయీ!” అంటూ అద్భుతంగా గానం చేశాడు. అలా దాసగణు షిరిడీ నుంచి కదలకుండానే ప్రయాగ స్నానం చేయించారు బాబా.

అలాగే పూలమ్మ గారికి కాశీ వెళ్ళకుండానే గంగా స్నానం ప్రసాదించిన ఈ పరమాద్భుత లీల వినండి. చుండూరు కామేశ్వరమ్మ అనే సామాన్య గృహిణిని తన అద్భుత శక్తి ద్వారా ఒక సద్గురువుగా పరిణామం చెందేలా చేశారు బాబా. ఆమె పూజ చేసినప్పుడు దోసిలి ఒగ్గగానే పువ్వులు వచ్చేవి. అందుకని ఆమె పూలమ్మగా సుప్రసిద్ధురాలయింది.

పూలమ్మగారికి అనేకమంది శిష్యులుండేవారు. ఒకసారి ఆమె శిష్యు డొకతను కాశీ యాత్ర చేసి తిరిగి వచ్చి ప్రసాదం, గంగా జలం పూలమ్మ గారికిచ్చాడు. అక్కడున్న వారందరు ప్రసాదం స్వీకరించారు. గంగా జలంతో సాయికి అభిషేకం చేశారు. అభిషేక జలం అందరు తీర్థంగా సేవించారు. ఆ రాత్రి పూలమ్మగారి మనసు కొంచెం వ్యాకులపడింది. మన ఆర్థిక స్థితి బాగా ఉండివుంటే మనం కూడ కాశీ యాత్ర చేసి వుండేవాళ్ళం కదా, పరమ పవిత్రమైన గంగా నదిలో స్నానం చేసే భాగ్యం లభించి వుండేది కదా! అని అనుకుంటూ తమకు అదృష్టాన్ని కలగజేయమని బాబాని మనసారా ప్రార్థిస్తూ నిద్రపోయింది.

తన భక్తురాలి అభీష్టం నెరవేర్చడానికి సాయీశ్వరుడి ఈ పూలా విలాసం వినండి. మరునాడు పూలమ్మ ప్రతిరోజూ లాగానే తెల్లవారు జామునే లేచింది. సాయి మీది స్తోత్రాలు కూనిరాగాలుగా పాడుకొంటూ ఇంటి పనులు చేసుకుంటున్నది. ఇంతలో ఏదో పనిపడి పూజా మందిరం దగ్గరకు వచ్చింది. వీరి పూజా మందిరంలో ద్వారకామాయి యందు సాయి ఆశీనుడైన పటం ఉంటుంది. సాయి పాదాల బొటనవ్రేళ్ళ వద్ద కొంచెం చెమ్మ కనిపించింది. పూలమ్మ ఆ చెమ్మను చేతితో తుడిచింది, క్రమంగా చెమ్మ నుండి బిందువులు బిందువులుగా జలం స్రవించసాగింది.

ఆశ్చర్యచకితురాలైన పూలమ్మ జలం స్రవించే ప్రాంతంలో చిన్న చెంబు ఉంచింది. తర్వాత నీటి బిందువులల్లా జలధారలయ్యాయి. ఒక బిందె నిండిపోయింది. అద్భుతంగా జలధారలు ప్రవాహంగా మారింది. మహా ధ్యానముద్భవిల్లింది. జలప్రవాహంలో రెండు బిందెలు నిండాయి. ఇంతలో పూలమ్మ గారి ఇంటిలోని సాయిబాబా ఫొటోలోంచి నీరు పారుతున్నది అన్న వార్త చుట్టుప్రక్కల వ్యాపించింది. ఉరుకులు పరుగుల మీద జనం రాసాగారు. ఈ సాయిలీలను ప్రత్యక్షంగా దర్శించి ధన్యులయ్యారు. ఆ నీరు ఇంటిలో కాలువగా ప్రవహించసాగింది. అందులో ఎందరో పొర్లాడారు. శిరస్సు మీద సంప్రోక్షించుకొన్నారు. ఇంతలో మహాధ్యానం ఆగిపోయింది. పాదాల గుట్ట జలప్రవాహం అంతర్ణితమయింది. కానీ పటం చెక్క చెదరలేదు.

రాత్రి తన మనోవైకల్యానికి హేతువైన గంగాజలాన్ని తన ఇంటికి సాయి ప్రసాదించారని ఆనంద పరవశురాలయింది. నాడు దాసగణుకు అను గ్రహించిన రీతిలోనే సాయి తననూ అనుగ్రహించారని పొంగి పోయింది. అలా బిందెలోని గంగాజలంతో పూలమ్మ దంపతులు స్నానం చేశారు. మిగిలిన బిందెడు జలం అందరికీ తీర్థంగా ఇవ్వబడింది. ఈ మహిమా న్విత దివ్యలీలను గాంచిన పూలమ్మగారి భర్త రామారావు మనసు ఆనందంతో పరవశించింది. అసంకల్పితంగా, అనాలోచితంగా ఆయన హృదయం నుంచి ఉప్పొంగిన కదిలే శార్దూలం ఈ రీతిగా పరుగులు పెట్టింది.

పాదాంగుష్టము నుండి వెల్వడే మహాధ్యానమును, తీర్థమాహ్లాదం బావమిలన్ ప్రవాహగతి, నయ్యారే! జనాల్ మూకలై తాదాత్మ్యంబు వహించి మ్రొక్కులిడ, ప్రత్యక్షానుభూతిని భవత్పాదాబ్జంబుల నంతట వేడెద మహాత్మా! సాయిదేవా! ప్రభూ!


జై సాయిబాబా

**- శ్రీ సాయిలీలా తరంగిణి,**

**(పూలమ్మగారికి సాయి ప్రసాదించిన దివ్యానుభూతులు)**







## ఇదే ఆహ్వానం

# సర్వతోభద్ర సాయిమందిర 18వ వార్షికోత్సవాలు

**శ్రీ సాయీ సేవా సమితి ట్రస్ట్ అనుబంధ శాఖ**

**శ్రీ సాయినాథ క్షేత్రం, మైనేనివారి పాలెం, రేపల్లె మండలం, బాపట్ల జిల్లా**

శ్రీ సాయి బంధువులారా!

కృష్ణానదీ తీరంలో పరమపూజ్యులు శ్రీ సాయినాథ క్షేత్ర ఆశ్రమ వ్యవ స్థాపకులు శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ వారిచే ప్రతిష్ఠితమైన **సర్వతో భద్ర సాయి దేవాలయం 18వ వార్షికోత్సవం తేది : 11.05.2024, 12.05.2024** జరుపుకుంటున్న సందర్భముగా మీ అందరినీ ఆహ్వానిస్తున్నది.

**కార్యక్రమములు**

| | | |
|---|---|---|
| **11.05.2024** | ఉ. 5.00 | కాకడ హారతి |
| **శనివారం** | 6.30 | శ్రీ సాయినాథుల వారికి క్షీర, జలాభిషేకాలు |
| | 8.30 | బాబా వారికి అష్టోత్తర శతనామ పూజ |
| | 10.00 | సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణ |
| | మ.12.00 | మహా హారతి, ప్రసాద వినిమయం |
| | సా. 7.00 | సాయి చాలీసా పారాయణ, భజన, సత్సంగ కార్యక్రమాలు |
| **12.05.2024** | ఉ. 5.00 | కాకడ హారతి |
| **ఆదివారం** | 6.30 | శ్రీ సాయినాథుల వారికి క్షీర, ఫల, జలాభిషేకాలు అనంతరం అలంకరణ, ప్రథమ పూజ |
| | 10.00 | సాయికి సహస్ర నామార్చన - వివిధ పుష్పాలతో సామూహికంగా |
| | 11.30 | సాయిదత్త పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారి ప్రవచనం |
| | మ.12.00 | మహాహారతి - 12.30కు అన్నప్రసాద వితరణ |

భక్తులందరూ పై పూజాదికాలన్నింటా పాల్గొని ధన్యులై, సాయిదేవుల ఆశీస్సులకు పాత్రులు కాగలరని ఆశిస్తున్నాము. ఈ ఉత్సవాలకు భక్తులందరూ ధన, ధాన్య, వస్తు శ్రమరూపేణ సహకరించవలసిందిగా కోరుతున్నాము.

**ఫోన్స్ : 9848133565, 9440413455**

**- ఉత్సవ కమిటీ, శ్రీ సాయినాథ క్షేత్రం**